క్లుప్తంగా

ఢిల్లీకి 'నామట్టి నాదేశం' కలశాలు



ఢిల్లీలో పాల్గొన్న జిల్లా వలంటీర్ బృందం

బేస్తవారిపేట: ఆజాది అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 62 మంది వలంటరీ బృందం కలశాలను తీసుకుని ఢిల్లీ చేరింది. ఢిల్లీలోని నూతన పార్లమెంట్ భవనం , ఇంటియా గేట్ వద్ద జరిగిన నా మట్టి నా దేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా నుంచి 62 మంది, రాష్ట్రం నుంచి 872 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ప్రకాశం జిల్లా నోడల్ అధికారి మాధవాచారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఏఓ సత్యం, సీనియర్ అసిస్టెంట్ లాలప్‌రెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలి



పరీక్షలు తనిఖీ చేస్తున్న ప్రమోద

దర్శి: పదో తరగతి విద్యార్థులను 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా వారికి విద్య నందించాలని జీసీడీఓ ప్రమోద సూచించారు. స్థానిక కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలల్లో ఎస్‌ఈఏఎస్ పరీక్షలు సందర్భంగా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. బాలికలకు భోజనం మెనూ ప్రకారం అందుతుంతా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో వసతులు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



కోటయ్య మృతదేహం

గిద్దలూరు రూరల్: పట్టణ శివారు మోడంపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి మద్యం తాగి ఫిట్స్ కారణంగా మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహేష్ కథనం ప్రకారం.. రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామానికి చెందిన సుంకరి కోటయ్య(55) కెఎస్.పల్లెలో తమ బంధువుల వద్దకు వెళ్లి వస్తానని ఇంటి వద్ద చెప్పి మోడంపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఓ అరుగుపై కూర్చుని మద్యం తాగాడు. ఇంతలో ఫిట్స్ కారణంగా మృతి చెందాడు. కోటయ్య మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఫిట్స్ కారణంగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

'మానవత' సంస్థకు ఫ్రీజర్ బాక్స్ విరాళం



సంస్థకు విరాళం అందిస్తున్న నారాయణబాబు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పొదిలి శాఖ డైరెక్టర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కాటూరి వెంకట నారాయణబాబు(పెద్దబాబు) ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందించారు. ఈ మేరకు శుక్రవారం సంస్థ అధ్యక్షుడు కల్లం వెంకట సుబ్బారెడ్డికి విరాళం చెక్కు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ మువ్వల పార్థసారథి, కన్వీనర్ కె.యల్లమందారెడ్డి, కార్యదర్శి తానికొండ వెంకటరావు, ఉపాధ్యక్షుడు బండి అశోక్, సామంతపూడి నాగేశ్వరరావు, యర్రం వెంకటేశ్వరరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే



కంభంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ మాల్యాద్రి

కంభం: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను శుక్రవారం మండలంలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించినట్లు ఎంఈఓ మాల్యాద్రి తెలిపారు. పాఠశాలల్లో విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకు 3,6వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారి వారి వాస్తవ సామర్థ్యాలను జాతీయ స్థాయిలో అంచనా వేయనున్నట్లు తెలిపారు. ప్రశ్నలకు సమాధానంగా విద్యార్థి ప్రతి స్పందనలను ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ విధానంలో నిర్వహిస్తున్నందున పాఠశాల స్థాయిలోనే పోటీ పరీక్షలు ఎదుర్కొనేందుకు సంసిద్ధతా లక్ష్యాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయా పాఠ్శాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



జగనన్న సురక్ష కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరమని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 34, 35 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, కోఆప్షన్ మెంబర్ గుంటక వనజాక్షి, 34వ వార్డు ఇన్‌చార్జి రోజ్‌లిడియా, మున్సిపల్ డీఈ సుబానీ, జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, నాయకులు గుంటక చెన్నారెడ్డి, అనీల్, రాజు, లూకా, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ ఏఎంసీ డైరెక్టర్ బి.గురవయ్య, ఉత్తమ్‌కుమార్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభం ప్రతిష్ట



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్ల పాలెంలో శ్రీస్వయంభు వీర నరసింహస్వామి వారి జీవ ధ్వజ స్తంభ, విమాన శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు నిత్యవిధులు, గర్తపూజ, రత్నన్యాసం, ధాతున్యాసం కార్యక్రమాల అనంతరం యంత్రస్థాపన, విమాన శిఖర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవధ్యాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే చర్యలు



మాట్లాడుతున్న విచారణాధికారి రాము

ముండ్లమూరు: మహిళల నుంచి వసూలు చేసిన రుణాల్లో ఆర్థిక క్రమశిక్షణ లోపిస్తే కఠిన చర్యలు తప్పవని విజయవాడ స్త్రీనిధి విచారణాధికారి కె.రాము హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ కేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రుణాల వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మండలం వెనకబడిందన్నారు. లక్షల రుపాయలు దుర్వినియోగమైనట్లు సమాచారం ఉందన్నారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు చెల్లించిన రుణాల్లో చేతివాటం ప్రదర్శించిన వారు వారం రోజుల్లో తిరిగి చెల్లించకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. వంద శాతం రికవరీ లేని గ్రామ సంఘాలపై ప్రత్యేక ఆడిట్ చేస్తామని చెప్పారు. గ్రామ సంఘాల వారిగా రివ్యూ నిర్వహించి నిధుల వివరాల గురించి తెలుసుకున్నారు. సమావేశంలో స్త్రీనిధి ఏజీఎం హర్ష వర్ధన్, మేనేజర్ పవన్ కళ్యాణ్, ఏపీఎం హనుమంత రావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్‌తో దాణా పంపిణీ



దాణా అందజేస్తున్న అధికారులు

దర్శి: మండలంలోని తూర్పు చౌటపాలెం గ్రామానికి చెందిన మారం సుబ్బారెడ్డి ఆవు పిందాన్ని ఏప్రిల్‌లో ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో అమర్చారు. దానికి రైతును ప్రోత్సహించేందుకు ఒంగోలు డీఏల్‌డీఏ ఆఫీస్ నుంచి రూ.2500 దాణాను శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఆవును జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి బేబిరాణి, డీఎల్‌డీఏ చైర్మన్ కోసూరి రాధ, ఈఓ డాక్టర్ కాలేషా, దర్శి ఏడీ డాక్టర్ పురుషోత్తమరాజు పరీక్షించి అనంతరం దాణా అందజేశారు. జిల్లాలో ఉన్న రైతులు అందరూ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ ఉపయోగించుకుని మంచి దూడలు పొందాలని డాక్టర్ బేబి రాణి కోరారు. ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజిస్ట్ డాక్టర్ బసవయ్యను అభినందించారు. మేలుజాతికి చెందిన ఆవులు, గేదెల పిండాలు రైతులకు అందుబాటులో ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఏ ఈఓ కాలేషా కోరారు.

ఫేక్ రిజిస్ట్రేషన్‌పై పోలీసుస్టేషన్లో ఫిర్యాదు

మార్కాపురం: మార్కాపురం పట్టణ పరిధిలో ఇటీవల జరిగిన ఒక ఫేక్ రిజిస్ట్రేషన్‌పై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వివరాలు.. పట్టణ పరిధిలో సర్వే నంబర్ 299/2 ఛిలో ఉన్న 1.08 ఎకరాల పొలాన్ని కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన ఆకుల గాలెయ్య ఫేక్ డాక్యుమెంట్లతో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశాడని అందిన ఫిర్యాదుపై విచారణ చేయాలని కోరినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఈ పొలం తనదని పట్టణానికి చెందిన రామడుగు వెంకట రమేష్ ఇటీవల స్పందన కార్యక్రమంలో కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సుంకేసులలో మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

పెద్దారవీడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ అన్నారు. మండలంలోని సుంకేసుల, ఏనుగులదిన్నెపాడు గ్రామ సచివాలయంలో పీఎస్ ఆర్. పెద్దిరాజు అధ్యక్షతన శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో పలు మార్పులు చేశారని, బాలలు అందరూ చదువుకోవాలని అమ్మఒడి, విద్యా దివెన, విద్యా వసతి దివెన వంటి పథకాలు కల్పించి బంగారు బాటలు వేశారన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. సర్పంచ్ బలుసుపాటి లూథియా, ఎంపీపీ (స్పెషల్) పాఠశాల హెచ్‌ఎం వినోద్‌శాస్త్రి, వీఆర్వో తిమ్మయ్య, పీఎస్ శ్రీనివాస రావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది శ్రీనునాయక్, అమీర్ బాషా, ఎంఎల్‌హెచ్ పి.శ్రావణి పాల్గొన్నారు.

ఆర్బీకేల సేవలు వినియోగించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంబవరం, వెల్లుపల్లె గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కంది పంటలను ఆశించే వెర్రి తెగులు దాని నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కంది పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పత్తి, ఆముదం, మిర్చి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువు అందుబాటులో ఉన్నాయన్నారు. సాంకేతిక వ్యవసాయశాఖాధికారి మహబూబ్‌బాషా ఉన్నారు.

ప్రయాణికులకు ఉచిత మినరల్ వాటర్



మినరల్ వాటర్‌ను పారంభిస్తున్న కరీముల్లా బేగ్

పొదిలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేసేందుకు హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు నీటి పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్ మాట్లాడుతూ.. బస్టాండ్‌లో 500 లీటర్ల మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాతను ఆర్టీసీ డిపో మేనేజర్ సుందరరావు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, న్యాయవాది షబ్బీర్, రిటైర్డ్ టీచర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామసుబ్బయ్య

గిద్దలూరు రూరల్: 18 ఏళ్లు నిండిన అర్హులకు ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామసుబ్బయ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆరు మండలాల తహసీల్దార్లు, బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని పోలీంగ్ కేంద్రాల్లో ఈ నెల 4, 5వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ ఓలు అందుబాటులో ఉంటు ఫారం 6,7,8 ద్వారా ఓటర్ల జాబితాల్లోని పేర్ల మార్పులు చేర్పులు, తప్పుల సవరణలు చేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. సదావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్లు డి.సీతారామయ్య, వరకుమార్, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఎన్నికల డీటీ భారతీబాయ్ పాల్గొన్నారు.

నాస్ పరీక్షకు 636 మంది హాజరు



కేజీబీవీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పుల్లలచెరువు: మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన నాస్ పరీక్షకు శుక్రవారం 636 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో శామ్యూల్‌జాన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేకు సంబంధించిన పరీక్షను మండలంలో 23 పాఠశాలల్లో నిర్వహించగా 3వ తరగతి 247, 6వ తరగతి 211, 9వ తరగతికి చెందిన 178 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, అన్ని కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందిగా నిర్వహించినట్లు ఎంఈవో తెలిపారు.

యర్రగొండపాలెం: మండలంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సాధన సర్వే పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. ఆయా పాఠశాలల్లో 3,6,9 తరగతులకు చెందిన 3151 మంది విద్యార్థులకు 1240 మంది పరీక్షల్లో పాల్గొన్నారని, ఈ పరీక్షకు 47 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్‌లను నియమించినట్లు తెలిపారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షతో విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకునేందుకు వీలుపడుతుందని, వారి సామర్థ్యాలు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

వరుణుడి కరుణతో రైతుల ఆనందం



వర్షానికి జలమయమైన బ్యాంకు వీధి

కురిచేడు: వరుణుడు కరుణించడంతో రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పంటలు కాపాడుకోవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వర్షం కురవక పోవడంతో రైతులు కొన్ని పంటలు మాత్రమే సాగు చేయగలిగారు. ఈ వర్షంతో పప్పుశనగ సాగు చేయవచ్చని, సాగు చేసిన కంది, పొగాకు, పత్తి పంటలను కాపాడుకునేందుకు అవకాశం లభించిందన్నారు. మెట్ట పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వీధులు జలమయమయ్యాయి. లోతట్టు ఇళ్లల్లోకి నీరు చేరింది. వర్షపు నీటికి మురుగు నీరు చేరి మూడు అడుగుల లోతు నీరు నిలిచిపోయింది.

ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు

పొదిలి రూరల్: పొదిలి మండల పరిషత్ కార్యాలయాన్ని రూ.15 లక్షలతో మరమ్మతులు చేస్తున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. ఈ భవనాన్ని 1965 సంవత్సరంలో పొదిలి సమితిగా ఉన్నపుడు నిర్మించినట్లు తెలిపారు. పురాతన భవనం కావడంతో పైకప్పు పెచ్చులూడి పడుతూ.. వర్షానికి ఉరుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రూ.15 లక్షలతో శ్లాబు, టైల్స్, విద్యుత్ పరికరాలు, కిటికీలకు మరమ్మతులు చేయిస్తున్నట్లు వివరించారు.

దొనకొండ ఎఫ్‌ఏ అనారోగ్యంతో మృతి



శాంతికుమారి (ఫైల్)

దొనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మురికిపూడి శాంతి కుమారి కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతోంది. ఒంగోలులో మెరుగైన వైద్యం పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. శాంతికుమారి భౌతిక దేహాన్ని ఉపాధి సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

క్షేత్రస్థాయిలో సక్రమంగా పని చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ రవికుమార్



సమీక్ష నిర్వహిస్తున్న పీడీ రవికుమార్

కొనకనమిట్ల: వైఎస్సార్ క్రాంతి పథం డీఆర్‌డీఏ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పని చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పథకం ద్వారా భారీ యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలు సక్రమంగా చెలిస్తున్న సంఘాలకు బ్యాంక్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. స్త్రీ నిధి రికవరీ, జగనన్న తోడు, పీఎంఈజీపీ లోన్స్, గ్రేడింగ్ మొదలైన వాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి, సీసీలు యల్రా, రామయ్య, రాజయ్య, వీఓఏలు, పొదుపు గ్రూపు అకౌంటెంట్లు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు విద్యాభివృద్ధి కృషి చేస్తోందని ఎంఈఓ నరసింహారావు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినులు నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. శుక్రవారం గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో 6, 9 తరగతులకు నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షను పర్యవేక్షించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయనే అంశాలపై నివేదిక ఇవ్వడం సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద పథకాలు అమలు చేయడంతోపాటు బైజూస్ కంటెంట్, ట్యాబ్స్ పంపిణీ చేస్తున్నారని వివరించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో డిజైన్ టూల్స్‌పై అవగాహన



సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ టూల్స్‌పై ఈసీఈ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య తెలిపారు. నరేష్ టెక్నాలజీస్ ఓబులేష్ ఆధ్వర్యంలో వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ టూల్స్‌పై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం, వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసిందని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌లను విద్యార్థులు ఉపయోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నా రంగనాయకులు, ఏఓ బి.ప్రభాకర్‌రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డి.సత్యనారాయణ, కేసీహెచ్ మల్లారెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్టు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వర్షం నీటి నిల్వతో భూగర్భ జలాలు రీచార్జ్



తర్లుపాడులో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తర్లుపాడు: పైకప్పుపై పడిన వర్షం నీటిని నిల్వచేస్తే భూగర్భ జలాలు రీచార్జ్ అవుతాయని ఎంపీడీఓ ఎస్.నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. నీటి సంరక్షణ కోసం మండలంలోని కలుజువ్వలపాడు, చెన్నారెడ్డిపల్లి, కేతగుడిపి సచివాలయా లలో, పోతలపాడు, తుమ్మల చెరువు, తాడివారిపల్లి పాఠశాల భవనాలు, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో.. ఇలా మొత్తం 7 రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులతో కరువు ఏర్పడినప్పటికీ నీటి కొరత లేకుండా భూగర్భ జలాల సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. ఇందుకుగానూ ఒక్కో నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో రూ.60 వేలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ పెద్దన్న, టీఏ శివారెడ్డి, ఎఫ్ఏ వీరాంజనేయులు, నాయకులు పల్లె పోగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.